సాక్షి
నిజామాబాద్

గురువారం । 25 । ఏప్రిల్ । 2024



కోటపాటి చేరికతో..

బీజేపీలో కోటపాటి నర్సింహ నాయుడి చేరికతో ఆర్మూర్ ప్రాంతంలో పార్టీ మరింత బలోపేతమవుతుందని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

- IIలో ▸



భారీగా నగదు పట్టివేత

సంగారెడ్డి-కామారెడ్డి జిల్లాల సరిహద్దులోని నిజాంసాగర్ మండలం వెల్గనూరులో పోలీసులు రూ.53 లక్షలు పట్టుకున్నారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
40.5 /26.7

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రైతులు అధిక దిగుబడులు సాధించాలి



నిజామాబాద్ రూరల్: ఆరుగాలం కష్ట పడుతున్న రైతులు అధిక దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు. బుధవారం మండలంలోని కాలూర్‌లో జిల్లా వ్యవసాయ అధికారి నేతృత్వంలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నదాతల వ్యవసాయ క్షేత్రాల్లో ఐదు ఫీట్ల వెడల్పు, ఐదు ఫీట్ల అడ్డం విస్తీర్ణంతో పంటను కోసి ఎకరానికి వచ్చే దిగుబడిని అంచనా వేశారు. ఈ ప్రయోగం ద్వారా రైతులు ఎకరానికి ఎంత ధాన్యం తీస్తున్నరనేది వ్యవసాయ అధికారులకు క్షుణ్ణంగా అర్థమవుతుందన్నారు. రైతులు వారు పండించే పంటలపై వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని అన్నదాతలకు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి హిరాజాదవ్, వ్యవసాయ విస్తీర్ణాధికారి స్వాతి లత, ఎంపీఎస్‌వో దీపిక, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ బీఆర్‌ఎస్‌ను వీడారు. ఆయన బుధవారం సంగారెడ్డిలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.

చైర్మన్‌పై అవిశ్వాసం నోటీస్

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణపై కౌన్సిలర్లు బుధవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు అవిశ్వాసం నోటీసు ఇచ్చారు. నోటీసు ఇచ్చినవారిలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుజాతతో పాటు కౌన్సిలర్లు శ్రీకాంత్, సాయిలు, శ్రీనివాస్, భూంగారి రాము, నీలకంఠం, విజయలక్ష్మి, జీనత్ సుల్తానా, భూదేవి, బాలమణి ఉన్నారు.

జహీరాబాద్‌లో సురేశ్ షెట్కార్ నామినేషన్



కామారెడ్డి క్రైం: జహీరాబాద్ నియోజకవర్గంలో బుధవారం 11 నామినేషన్లు దాఖలయ్యాయి. బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ ఒక సెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి క్రాంతి వల్లూరుకు అందజేశారు. ఆయన వెంట సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, పలువురు బీఆర్ నేతలు ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ రెండు సెట్ల నామినేషన్లు వేశారు. కార్యక్రమంలో మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే ధర్మ సమాజ్ పార్టీ నుంచి దేవ శిఖామణి, రాష్ట్ర సామాన్య ప్రజా పార్టీ అభ్యర్థిగా మహ్మద్ మున్వర్ హుస్సేన్, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా బట్టెంకి బాల్‌రాజ్, స్వతంత్ర అభ్యర్థులుగా తలారి అశోక్, జైపాల్ నాయక్ జాదావత్, రమేశ్ సజ్జాపూర్, యాకూబ్ షరీఫ్, గొల్లపల్లి మణయ్య ఒక్కో సెట్ చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు.

బాలికలదే పైచేయి..

- ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థినులు
- ఫస్టియర్‌లో బాలికలు 60.5 శాతం, బాలురు 35 శాతం ఉత్తీర్ణత
- సెకండియర్‌లో బాలికలు 67.55 శాతం, బాలురు 49.9 శాతం..



నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ ఫలితాల్లో బాలికల సత్తా చాటారు. మరోసారి తమదే పైచేయి అని నిరూపించుకున్నారు. బుధవారం ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాలు విడుదల కాగా.. ఫస్టియర్, సెకండియర్ ఫలితాల్లో బాలుర కంటే బాలికలే ఎక్కువ ఉత్తీర్ణత శాతం సాధించారు. కాగా ఫలితాల్లో గతేడాదితో పోలిస్తే జిల్లా వెనుకబడింది. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో గతేడాది రాష్ట్రం జిల్లా 26వ స్థానంలో నిలవగా ఈసారి 29వ స్థానానికి పడిపోయింది. మొదటి సంవత్సరం ఫలితాల్లో గతేడాది 25వ స్థానంలో ఉండగా.. ప్రస్తుతం 27 స్థానంలో నిలిచింది.

ఇక ఫలితాల్లో భాగంగా ఇంటర్ రెండో సంవత్సరం జనరల్‌లో మొత్తం 59.59శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. బాలురు 49.9 శాతం ఉత్తీర్ణులు కాగా, బాలికలు 67.57 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 13,988 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వీరిలో 8,335 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 7,671 మంది విద్యార్థినులకు గాను 5,183 మంది పాసయ్యారు. బాలురు 6,317 మంది పరీక్షలకు హాజరు కాగా 3,152 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ రెండో సంవత్సరంలో బాలురు 38 శాతం పాస్ కాగా.. బాలికలు 80 శాతం ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 1,999 మంది విద్యార్థులు పరీక్ష రాయగా.. 1,049 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో 703 మంది బాలికలు పరీక్షలకు హాజరు కాగా 559 మంది పాసయ్యారు. బాలురు 1,296 మంది పరీక్షలు రాయగా 490 మంది పాసై 38 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు.

అలాగే మొదటి సంవత్సరం జనరల్ ఫలితాల్లో మొత్తం 49.95 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 37.5 శాతం, బాలికలు 60.57 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 14,974 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 7,479 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలికలు 8,076 మంది పరీక్షలకు హాజరు కాగా 4,892 మంది విద్యార్థులు పాసయ్యారు. బాలురు 6,898 మంది పరీక్షలు రాయగా 2,587 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే మొదటి సంవత్సరం ఒకేషనల్‌లో మొత్తం 43.17 శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 29.95 శాతం పాసవగా.. బాలికలు 65.54 శాతం ఉత్తీర్ణులయ్యారు. మొత్తం 2,400 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 1,036 మంది పాసయ్యారు. వీరిలో 891 పరీక్షలు రాయగా, 584 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురలో 1509 మంది విద్యార్థులకు గాను 452 మంది పాసయ్యారు.

ఇంటర్ మొదటి సంవత్సరం

ఏడాది	రాసిన వారు	పాసైన వారు	శాతం
2018-19	17,004	9,618	57.00
2019-20	19,337	9,430	49.00
2020-21	18,697	18,697	100.00
2021-22	15,360	8,974	58.00
2022-23	15,215	7,782	51.00
2023-24	14,974	7,479	49.95

రెండో సంవత్సరం

ఏడాది	రాసిన వారు	పాసైన వారు	శాతం
2018-19	16,116	10,726	67.00
2019-20	17,364	10,465	60.00
2020-21	16,265	16,265	100.00
2021-22	15,742	10,372	65.00
2022-23	14,086	8,561	60.00
2023-24	13,988	8,335	59.59

రాష్ట్రస్థాయి మార్కులు సాధించిన విద్యార్థులు

జిల్లాకు చెందిన పలు ప్రైవేటు కళాశాలలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. ఎంపీసీ సెకండియర్‌లో బోధన్‌లోని ఉషోదయ విద్యార్థి కడెం అంకిత ఎంపీసీ విభాగంలో 993/1000 మార్కులు, నగరంలోని నారాయణ కళాశాల విద్యార్థి కీర్తన శివరాసి- 991/1000 మార్కులు సాధించారు. బైపీసీ సెకండియర్‌లో సౌమ్య-975, వైష్ణవి-975 మార్కులు సాధించారు. ఎంపీసీ మొదటి సంవత్సరంలో ఎస్ఆర్ కళాశాల విద్యార్థులు శ్రీనిధి-468, శ్రీనిత్య-467 మార్కులు సాధించారు. బైపీసీలో ఫస్టియర్‌లో నగరంలోని ఎస్ఆర్ కళాశాల విద్యార్థి స్నేహ-438/440 మార్కులు, విక్టర్ కళాశాల విద్యార్థి వర్షిణి-437/440 మార్కులు సాధించారు.

ఇంజినీర్‌ను అవుతా..



ఇంజినీర్‌ను కావడం నా లక్ష్యం. మొదటి నుంచి కళాశాల లెక్చరర్ల సూచనల మేరకు ప్రణాళికాబద్ధంగా చదివా. ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసుకున్నాను. నా తల్లిదండ్రులు టైలరింగ్ చేస్తూ చదివించారు. భవిష్యత్తు మరింత బాగా చదువుతా.

– బైరి శ్రీనిధి, ఎంపీసీ ఫస్టియర్, ఎస్ఆర్ కళాశాల (468/470)

డాక్టర్ కావాలన్నదే లక్ష్యం



ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో మంచి మార్కులు సాధించడం సంతోషంగా ఉంది. డాక్టర్ కావాలన్నదే లక్ష్యం. అందుకనుగుణంగా చదువుతున్నాను. కళాశాలలో మంచి విద్యాబోధన అందుబాటులో ఉండడం నాకు కలిసి వచ్చింది.

–వర్షిణి, బైపీసీ ఫస్టియర్, విక్టర్ కళాశాల (437/440)

ఇంటింటికి ఓటరు స్లిప్పులివ్వాలి

- నామినేషన్ల స్క్రూటినీలో నిబంధనలు పక్కాగా పాటించాలి
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

సుభాష్‌నగర్ : పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఓటరు ఓటు హక్కును వినియోగించుకునేలా గురువారం నుంచి ఇంటింటికి ఓటరు స్లిప్పులను పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ సూచించారు. బుధవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. తుది ఓటరు జాబితా రూపకల్పన, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, పోలింగ్ కేంద్రాలలో సదుపాయాల కల్పన, ఓటర్లకు స్లిప్పుల పంపిణీ, స్ట్రాంగ్ రూమ్ ల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు తదితర అంశాలపై కీలక సూచనలు చేశారు. ఓటరు నమోదు కోసం వచ్చిన పెండింగ్ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ నెల 25న తుది ఓటరు జాబితాను రూపొందించాలన్నారు. నామినేషన్ల ఉపసంహరణ పూర్తయిన తర్వాత ఈ నెల 29న పోటీలో ఉన్న గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులకు తుది ఓటరు జాబితాను అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రాంతాల వారీగా రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేయాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి ఏర్పాట్లను పరిశీలించాని సూచించారు. తాగునీరు, టాయిలెట్స్, విద్యుత్ సరఫరా, ఫ్యాన్లు వంటి వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. నామినేషన్ల స్వీకరణకు చివరి రోజైన గురువారం మధ్యాహ్నం 3.00 గంటల లోపు రిటర్నింగ్ అధికారి కార్యాలయం వద్దకు చేరుకున్న వారి నామినేషన్లు స్వీకరించాలని, గడువు దాటిన మీదట వచ్చే వారి నామినేషన్లు స్వీకరించకూడదని స్పష్టం చేశారు. ఈ నెల 26న స్క్రూటినీ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలన్నారు. స్క్రూటినీలో నామినేషన్లు తిరస్కరణకు గురైతే, అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొనాలని సూచించారు. నామినేషన్ల ఉపసంహరణ పూర్తయ్యాక పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలు, గుర్తులతో కూడిన పోస్టల్ బ్యాలెట్‌ల ముద్రణ చేయించాలన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్ అంకిత్, నగరపాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్, సహాయ రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

ఐడీసీఎంఎస్ ఇన్‌చార్జి చైర్మన్ బాధ్యతల స్వీకరణ

సుభాష్‌నగర్: ఇందూరు జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఐడీసీఎంఎస్) ఇన్‌చార్జి చైర్మన్‌గా వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి (బీబీపేట్ సొసైటీ చైర్మన్) బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ డైరెక్టర్లు, సిబ్బంది, ప్రభుత్వం సహకారంతో ఐడీసీఎంఎస్‌ను మరింత లాభాల బాటలో నడిపిస్తానని అన్నారు. అనంతరం ఇంద్రసేనారెడ్డికి డైరెక్టర్లు, సొసైటీ చైర్మన్లు, సిబ్బంది సన్మానించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఈ శ్రీనివాస్‌గౌడ్, నల్లవెల్లి కపిల్‌రెడ్డి, ఎన్ రాజేశ్వర్, రాజాగౌడ్, సొసైటీ చైర్మన్లు, బిజినెస్ మేనేజర్ కె నగేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన ఇంద్రసేనారెడ్డి

నేటి నుంచి డిగ్రీ, పీజీ కళాశాలల్లో తనిఖీలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలల అనుబంధ గుర్తింపుపై తనిఖీలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. తెయూ పరిధిలో 3 ప్రభుత్వ పీజీ కాలేజీలు, 12 ప్రైవేటు పీజీ కాలేజీలు, 16 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు(గురుకుల కళాశాలలు కలుపుకుని), 54 ప్రైవేటు డిగ్రీ కాలేజీలు, మూడు ఎంబీఏ, ఒకటి ఎంసీఏ కాలేజీలు ఉన్నాయి. వర్సిటీ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ ఆధ్వర్యంలో యూజీసీ, రాష్ట్ర ఉన్నత విద్యామండలి, ఏఐసీటీఈ, యూనివర్సిటీ నిర్దేశించిన నియమ, నిబంధనలకు లోబడి తనిఖీలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా కాలేజీ భవనం(లీజ్ బిల్డింగ్, సొంత బిల్డింగ్) డాక్యుమెంట్స్, ఫ్రెష్ ఈసీ, మున్సిపల్ పరిధిలో ఉంటే ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్, పారిశుధ్యం సర్టిఫికెట్, లైబ్రరీ, ల్యాబ్స్, క్రీడామైదానం, పార్కింగ్ స్థలం, విద్యార్థుల సంఖ్య కనుగుణంగా టీచింగ్ ఫ్యాకల్టీ, తరగతి గదులు, మౌలిక వసతి సౌకర్యాలు ఉన్నాయా లేవా అనే వాటిపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. అలాగే కాలేజీలో పనిచేస్తున్న ఫ్యాకల్టీ, సిబ్బంది వేతనాలు ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు చేస్తున్నారా.. వాటికి సంబంధించిన బ్యాంకు స్టేట్‌మెంట్స్ పరిశీలిస్తారు. అయితే పలు ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలకు ఇప్పటికీ సొంత భవనాలు లేవు. ప్రతిసారీ సొంత భవనం నిర్మించుకుంటామని వర్సిటీకి అండర్‌టేకింగ్ ఇస్తూ అనుబంధ గుర్తింపు తీసుకుంటున్నారు. సరైన టీచింగ్ ఫ్యాకల్టీ, లైబ్రరీ, క్రీడా మైదానం లేకుండా ఏళ్ల తరబడి ఇలాగే నెట్టుకొస్తున్నారు. అయినా వర్సిటీ ఉన్నతాధికారులు కూడా చూసీచూడనట్లు అనుబంధ గుర్తింపు ఇస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ సారైనా తనిఖీలను పకడ్బందీగా నిర్వహించి నిబంధనలు పాటించకుండా, కనీస సౌకర్యాలు లేకుండా కొనసాగుతున్న ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీలపై కొరడా ఝులిపించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అవసరమైతే ఆయా కాలేజీల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. కనీస సౌకర్యాలు లేని కళాశాలలకు సౌకర్యాల కల్పనకు నెలరోజుల పాటు గడువు ఇస్తామని ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు.



ఆరో రోజు 18 నామినేషన్లు దాఖలు

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- నేటితో ముగియనున్న నామినేషన్ల స్వీకరణ
- బీజేపీ అభ్యర్థి నామినేషన్‌కు ఉత్తరాఖండ్ సీఎం

సుభాష్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి బుధవారం 18 నామినేషన్లు దాఖలయ్యాయని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్ తరపున నాలుగో సెట్ నామినేషన్, బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ తరపున మూడో సెట్ నామినేషన్, కాంగ్రెస్ అభ్యర్థిగా టి.జీవన్‌రెడ్డి నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారన్నారు. స్వతంత్ర అభ్యర్థి ఆరె రాజేందర్ మూడోసెట్ నామినేషన్ వేశారని, సాయికృష్ణమూర్తి యుగ తులసి పార్టీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలు దాఖలు చేశారని వివరించారు. అలాగే స్వతంత్ర అభ్యర్థులుగా కొండూరు గంగాధర్, పోతు నవీన్, దేశబోయిన లక్ష్మీనారాయణ, చెంచుల అశోక్, ఇండియా ప్రజాబంధు పార్టీ అభ్యర్థిగా మొగిలి రాజ్‌కుమార్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా పానుగంటి రజిత వాణి, ప్రజాసేన పార్టీ అభ్యర్థిగా పోతు నాగార్జున్ ఒక సెట్ చొప్పున, స్వతంత్ర అభ్యర్థిగా ముత్యం రఘు రెండు సెట్ల నామినేషన్లు సమర్పించారని తెలిపారు. ఆలిండియా నేషనల్ పార్టీ అభ్యర్థిగా ఎండీ షాహెద్ ఖాన్ రెండోసెట్ నామినేషన్ వేశారని వివరించారు. కాగా నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థానానికి ఇప్పటివరకు 33 మంది అభ్యర్థులు మొత్తం 62 నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు.

ఇప్పటి వరకు 33మంది అభ్యర్థులు..

పార్లమెంట్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైన 18వ తేదీ నుంచి నిజామాబాద్ లోక్‌సభ పార్లమెంట్ నియోజకవర్గానికి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. ఆదివారం మినహా ఆరు రోజులకు గాను మొత్తం 33 మంది అభ్యర్థులు 62 నామినేషన్లు దాఖలు చేశారు. ప్రధాన పార్టీలైన బీజేపీ అభ్యర్థిగా అర్వింద్ ధర్మపురి మూడు సెట్లు, కాంగ్రెస్ అభ్యర్థిగా టి జీవన్‌రెడ్డి ఒకేరోజు నాలుగు సెట్లు, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా బాజిరెడ్డి గోవర్ధన్ నాలుగు సెట్లు దాఖలు చేశారు. నామినేషన్ల దాఖలుకు గురువారం చివరిరోజు కావడంతో నామినేషన్ల సంఖ్య మరింత పెరిగే అవకాశముంది. కాగా 26న నామినేషన్ల స్క్రూటినీ, 29న మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంది. మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ చేపట్టనున్నారు.



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న జీవన్‌రెడ్డి

నేడు జిల్లాకు పుష్కర్‌సింగ్ ధామి

పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల దాఖలుకు చివరి రోజు కావడంతో బీజేపీ అభ్యర్థి అర్వింద్ ధర్మపురి తరపున చివరి సెట్ నామినేషన్ దాఖలు చేసేందుకు ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్‌సింగ్ ధామి జిల్లాకు రానున్నారు. ఈసందర్భంగా ఎన్నికల ప్రచారంలోభాగంగా పాత కలెక్టరేట్ మైదానంలో జరిగే బీజేపీ బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించనున్నారు.

జిల్లాకు చేరుకున్న ఎన్నికల పరిశీలకులు

సుభాష్‌నగర్: నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని ఎన్నికల అంశాలకు సంబంధించి ప్రజలు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల పరిశీలకులకు ఫిర్యాదులు, సూచనలు చేయవచ్చని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు.

సాధారణ పరిశీలకులుగా ఐఏఎస్ అధికారి ఎలిస్ వజ్ ఆర్ వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఫిర్యాదులు చేయాలనుకునే వారు జనరల్ అబ్జర్వర్ (సెల్ నెంబర్ 89853 40522)ను సంప్రదించవచ్చని, జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి 11 గంటల మధ్య నేరుగా కలిసి ఫిర్యాదులు, సూచనలు అందజేయవచ్చన్నారు. వ్యయ పరిశీలకులుగా డీఎం నెప్జీ (ఐఆర్ఎస్ 2015 బ్యాచ్) వ్యవహరిస్తున్నారని, సెల్ నెంబర్ 8985341588 ద్వారా అబ్జర్వర్‌ను సంప్రదించవచ్చని కలెక్టర్ సూచించారు. వ్యయ పరిశీలకులను జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథిగృహంలో ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు నేరుగా కలిసి ఫిర్యాదులు, సూచనలు చేయవచ్చన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంత వరకు అబ్జర్వర్లు అందుబాటులో ఉండి ఎన్నికల అంశాలను పరిశీలిస్తారని, సెలవు రోజుల్లో మినహాయించి మిగితా అన్ని రోజుల్లో నిర్ణీత సమయాల్లో పరిశీలకులను సంప్రదించవచ్చని అన్నారు. బుధవారం జిల్లా కేంద్రానికి చేరుకున్న ఎన్నికల పరిశీలకులు ఎలిస్ వజ్ ఆర్‌కు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తదితరులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.



ఎలిస్ వజ్ ఆర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

రైతు, దళిత, గిరిజనుల వ్యతిరేకి బీజేపీ

- ఐదేళ్లలో ఎంపీ అర్వింద్ చేసిందేంటో చెప్పాలి
- కుల గణనకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి

సుభాష్‌నగర్ : బీజేపీ రైతు, దళిత, గిరిజనుల వ్యతిరేక పార్టీ అని, ఆ పార్టీకి ఎలాంటి రాజకీయ, అభివృద్ధి, సంక్షేమ, రైతు విధానం లేదని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి తాటిపర్తి జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీ కేవలం మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రసంగాలు చేసి ఓట్ల రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ప్రజాస్వామ్యానికి, నియంతృత్వానికి మధ్య జరుగుతున్న ఎన్నికలని అన్నారు. దేశ సమగ్రత, సమైక్యత, అభ్యున్నతి, సంక్షేమానికి కాంగ్రెస్ పాటుపడిందన్నారు. బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగా సమాజంలో నిరుపేద వర్గాలకు రిజర్వేషన్లు వర్తింపజేసిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వం పదేళ్లలో ఏనాడూ దళిత, గిరిజన, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎలాంటి సంక్షేమ పథకాలు అమల్జేయలేదని ఆరోపించారు. హిందూ, భిన్నవర్గాలు అనే భావన లేకుండా లౌకికవాదానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. హిందువులు అనే నెపంతో దళిత, గిరిజన వర్గాలను విచ్ఛిన్నం చేస్తోందని, వారంతా హిందువులుగానే కాంగ్రెస్ భావిస్తోందని తెలిపారు. దేశ పురోగాభివృద్ధికి బీజేపీ వద్ద ఎలాంటి ఆలోచన, ప్రణాళిక లేదని ఎద్దేవాచేశారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

పాకిస్తాన్, చైనాపై యుద్ధం..

కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో పాకిస్తాన్, చైనాపై యుద్ధం ప్రకటించిందని జీవన్‌రెడ్డి గుర్తుచేశారు. బీజేపీ జాతీయవాదం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఏనాడు దేశం, జాతీయత కోసం బీజేపీ త్యాగాలు చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. దేశ ఐక్యత, సమగ్రత, సమైక్యత కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. కుల గణనకు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో ఉన్న అన్ని వనరులతో దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, ఆర్మూర్ నుంచి ఆదిలాబాద్, బోధన్ నుంచి బీదర్ వరకు రైల్వేలైన్ ఏర్పాటు చేయిస్తానని అన్నారు. ఇందూరును స్మార్ట్ సిటీగా మారుస్తానన్నారు. సమావేశంలో రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతి రెడ్డి, డీసీసీ ప్రధానకార్యదర్శి గడుగు గంగాధర్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని విస్మరించారు..

బీజేపీ రైతు వ్యతిరేకి అని, దేశంలోని రైతు సంక్షేమాన్ని ఆ ప్రభుత్వం విస్మరించిందని జీవన్ రెడ్డి ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రుణమాఫీ, ఉచిత విద్యుత్ సరఫరా లేదని రైతులు గ్రహించాలని సూచించారు. పసుపు బోర్డు ఎందుకు ఏర్పాటు చేయలేదని, చక్కెర కర్మాగారాలు తెరవలేదని, సెజ్‌లో వ్యవసాయాధారిత పరిశ్రమలు ఎందుకు నెలకొల్పలేదని అర్వింద్‌ను ప్రశ్నించారు. అర్వింద్ ఐదేళ్లలో చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

16 నుంచి స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్స్ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో స్కిల్ ఎన్‌హాన్స్‌మెంట్ కోర్సు 2, 4, ఆరో సెమిస్టర్ రెగ్యులర్/బ్యాక్‌లాగ్ ప్రాక్టికల్ పరీక్షల షెడ్యూల్ బుధవారం కంట్రోలర్ ఎం అరుణ విడుదల చేశారు. ఈ సందర్భంగా కంట్రోలర్ మాట్లాడుతూ.. గ్రూప్-ఏ కళాశాలల్లో మే 16 నుంచి 31 వరకు, గ్రూప్-బీ కళాశాలల్లో మే 25 నుంచి 31వరకు నిర్వహించి, మార్కులను తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. పూర్తి వివరాలు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ www. telanganauniversity. ac. in లో పొందుపర్చినట్లు వెల్లడించారు.

పీజీ సెమిస్టర్ పరీక్షల్లో ఒకరి డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల్లో బుధవారం మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన ఒక విద్యార్థిని డిబార్ చేసినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఎంబీఏ, ఎంసీఏ 4వ సెమిస్టర్ పరీక్షలకు మొత్తం 564 మంది విద్యార్థులకు 530 మంది హాజరు కాగా 26 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు. గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ కేంద్రంలో విద్యార్థి మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడి డిబార్ అయినట్లు తెలిపారు.

బీఈడీ పరీక్షల్లో 56 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న బీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. మొత్తం 1062 మంది విద్యార్థులకు 1006 మంది హాజరు కాగా 56 మంది గైర్హాజరైట్లు ఆయన వివరించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

మద్నూర్: మంజీర నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక బొలెరో వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. రాత్రిపూట అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని సమాచారం అందడంతో పెట్రోలింగ్ ముమ్మరం చేశామని ఎస్సై తెలిపారు. బిచ్కుంద మండలం ఖద్గావ్ శివారులోని మంజీర నుంచి మూడు ట్రాక్టర్‌లు, ఒక బొలెరో వాహనంలో ఇసుక తరలిస్తుండగా డోంగ్లీ మండలం దోతి శివారులో పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఖద్గావ్ గ్రామానికి చెందిన ఆరుగురు, మహారాష్ట్రకి చెందిన ఒకరిపై కేసు నమోదు చేశామన్నారు.

మాచారెడ్డి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పాల్వంచ వాగు నుంచి ఇసుక తరలిస్తుండగా చుక్కాపూర్ శివారులో మంగళవారం రాత్రి పట్టుకున్నామని చెప్పారు.

'తెలంగాణ సాహిత్య ఉద్యమం' పుస్తకావిష్కరణ



కామారెడ్డి అర్బన్ : తెలంగాణ ఉద్యమ సాహిత్య విలువలను భావితరాలకు అందించే ప్రయత్నం చేసిన రచయిత తుర్లపాటి లక్ష్మి, ఎనిశెట్టి శంకర్‌ల సాహిత్య కృషి ఉద్యమ చరిత్రలో నిలిచిపోతుందని ప్రముఖ కాలమిస్ట్ జి.లచ్చయ్య అన్నారు. తుర్లపాటి లక్ష్మి, శంకర్ రాసిన 'తెలంగాణ ఉద్యమ సాహిత్యం-ఉమ్మడి నిజామాబాద్ జిల్లా' పుస్తకావిష్కరణ ను జి.లచ్చయ్య స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీలోని అమర వీరుల స్తూపం వద్ద ఉద్యమకారుల ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం చేశారు. ఏపీటీఎఫ్ ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కే.వేణుగోపాల్ మాట్లాడుతూ పుస్తక రచయితలు లక్ష్మి,శంకర్ 360 పేజీలున్న పుస్తకంలో సమస్త లిఖిత సాహిత్యాన్ని సేకరించి రాష్ట్ర ఉద్యమంలో నిజామాబాద్ జిల్లా కృషిని భవిష్యత్తు తరాల కోసం మార్గనిర్దేశంగా పరిశోధక విద్యార్థులు, కర్తలకు, సాహిత్యఅభిమానులకు అందించినట్లు పేర్కొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా

నిజామాబాద్ అర్బన్: ఇంటర్ ఫలితాల్లో జిల్లాలోని ప్రైవేట్ కళాశాలల విద్యార్థులు సత్తా చాటారు. నగరంలోని ఎస్ఆర్ కాలేజీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు. ఎంపీసీ సెకండియర్‌లో కళాశాలకు చెందిన కొర్వ సౌమ్య 9900, శ్రీనిజ 989, రాకేశ్‌గౌడ్ 989, శ్రీహిత 988, శ్రీజ 987 మార్కులు సాధించారు. ఫస్టియర్ బైపీసీలో స్నేహ 438, దాసరి వైష్ణవి 436, నిశితశ్రీ, దుర్గ 436, ఫాతిమా 436, కొండుకరిద్ది-435 మార్కులు సాధించారు. ఎంపీసీ ఫస్టియర్‌లో శ్రీనిధి 468, శ్రీనిత్య 467 మార్కులు సాధించారు. కాలేజీలో ఫస్టియర్‌లో 9 మంది విద్యార్థులు 467 మార్కులు సాధించారు. 18 మంది 466 మార్కులు సాధించారు. 12 మంది 465 మార్కులు సాధించారు. 460కిపైబడి 115 మంది మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో 430కిపైగా 14 మంది ఉత్తమ మార్కులు సాధించారు. సెకండీయర్ ఎంపీసీలో 43 మంది 980 కిపైగా మార్కులు సాధించారు. కళాశాల డీజీఎం గోవర్ధన్‌రెడ్డి , జోనల్ ఇన్‌చార్జులు ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానించారు.

'వెక్టర్' జయకేతనం

ఎంపీసీ మొదటి సంవత్సరంలో నగరంలోని వెక్టర్ కళాశాలకు చెందిన ప్రద్యుమ్న 466, వెన్నెల 466, సంకృతి 466, నిశాంత్‌రెడ్డి 466, స్నిగ్ధ-466 మార్కులు సాధించారు. బైపీసీలో మొదటి సంవత్సరంలో వర్షిణి 437, శ్రద్ధ-435 సాధించారు. సెకండియర్ ఎంపీసీలో సాయిదుర్గ 980, చరణ్ ఆదిత్య 979, బైపీసీలో సౌమ్య 975, వైష్ణవి 975 మార్కులు సాధించారు.

ఎస్ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ

నగరంలోని ఎస్ఎస్ఆర్ కాలేజీ విద్యార్థులు ఉత్తమ మార్కులతో ప్రతిభ చాటారు. ఎంపీసీ సెకండియర్‌లో హర్షిత 918, వామన్ 869, మదన్ 868, ఫస్టియర్‌లో నవీన్ 391, అక్షయ్ 379, వైశాలి 369 మార్కులు సాధించారు. అదేవిధంగా వొకేషనల్ ఎంపీహెచ్‌డబ్ల్యూ(ఎఫ్) గ్రూప్‌లో అనిత 408, మేహుక్ 398 మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ మారయ్యగౌడ్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రవీందర్‌గౌడ్ అధ్యాపకులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మారయ్యగౌడ్



వైష్ణవి 466/470



స్నేహ 438/440

'నారాయణ' ప్రభంజనం

నగరంలోని నారాయణ జూనియర్ కాలేజీ విద్యార్థి నారామాధవి నాగస్రావ్య ఫస్టియర్‌లో 467 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. లవంగా వైష్ణవి 466, పంచమహల్కర్ రియా 466 మూడో ర్యాంకు సాధించారు. రెండో సంవత్సరంలో ఎంపీసీలో శివరాశి కీర్తన 991, మర్రి హర్ష 987, ఈశ 986, లిఖిత్ 985 మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కుంట లక్ష్మారెడ్డి అభినందించారు.

సత్య వొకేషనల్ విద్యార్థులు

ఇంటర్ వొకేషనల్ ఫలితాల్లో సత్య వొకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారు. కళాశాలకు చెందిన శ్రద్ధ కంప్యూటర్ సైన్స్ కోర్సులో 473/500, మెడికల్ ల్యాబ్ టెక్నిషియన్ కోర్సులో సాయిచరణ్ 454/500, అంజుమ్ 465/500, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ ఫీమేల్ కోర్సులో మమ్మాయి కీర్తన 427/500 మార్కులు సాధించినట్లు కళాశాల చైర్మన్ చిలివేరి సురేష్‌బాబు, డైరెక్టర్ మురళీకృష్ణలో తెలిపారు.

ప్రణాళికతో చదివాను



ప్రణాళికతో చదివి ఇంటర్‌లో 991 మార్కు లు సాధించాను. ప్రతి రోజు లెక్చరర్ల బోధనతో పాటు రీడింగ్ క్లాస్‌లు ఎంతగానో ఉ పయోగపడ్డాయి. ప్రతి సబ్జెక్టుల్లో వంద శా తం మార్కులు సాధించాలనే లక్ష్యంగా చదివాను. మంచి మార్కులు రావడంతో సంతోషంగా ఉంది. ఐఏఎస్ కావాలన్నదే నా లక్ష్యం. – శివరాశి కీర్తన, ఎంపీసీ, నారాయణ కళాశాల

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..



నేను ఇంటర్‌లో 990 మార్కులు సాధించడానికి నా తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిది. దీనికి తగినట్లుగా కళాశాల్లో మంచి బోధన లభించింది. దీంతో ఉత్తమ మార్కులు సాధించాను. ఇంజినీర్ కావలన్నదే నా లక్ష్యం. మరింత కష్టపడి చదివి రానున్నరో జుల్లో మంచి ర్యాంకులు సాధిస్తాను. – కొర్వ సౌమ్య, ఎంపీసీ, ఎస్ఆర్ కళాశాల

భవిష్యత్తులో మరిన్ని ర్యాంకులు సాధిస్తా



ఇంటర్ ఫస్టియర్‌లో 466 మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించాను. భవిష్యత్తులోనూ మంచి మార్కులు సాధించడానికి కృషి చేస్తాను. సెకండియర్‌లో రాష్ట్రస్థాయి ర్యాంక్ లక్ష్యంగా చదువుతా. కళాశాలలో అధ్యాపకుల బోధన ఎంతో బాగుంది. – ప్రద్యుమ్న, ఎంపీసీ, వెక్టర్ కళాశాల

జిల్లాలో కాలేజీల వారీగా ఉత్తీర్ణత శాతం

ఫస్టియర్‌లో..

కళాశాలలు	విద్యార్థులు	పాసైన వారు	ఉత్తీర్ణత శాతం
ప్రభుత్వ	3095	947	30.6
ఎయిడెడ్	153	31	20.26
సోషల్ వెల్ఫేర్	548	361	65.88
గిరిజన సంక్షేమ	157	80	50.96
బీసీ గురుకులాలు	603	412	68.33
కేజీబీవీలు	561	365	65.06
మోడల్	1102	449	40.74
రెసిడెన్షియల్	227	187	82.38
మైనారిటీగురుకులాలు	786	566	72.01

సెకండియర్‌లో..

కళాశాలలు	విద్యార్థులు	పాసైన వారు	ఉత్తీర్ణత శాతం
ప్రభుత్వ	3642	1618	44.43
ఎయిడెడ్	205	50	24.39
సోషల్ వెల్ఫేర్	501	374	74.64
గిరిజన సంక్షేమ	146	96	65.75
రెసిడెన్షియల్	220	197	89.55
మోడల్	1370	660	48.18
కేజీబీవీలు	503	348	69.18
మైనారిటీ గురుకులాలు	656	547	83.38
బీసీ గురుకులాలు	203	150	73.89

పేదింటి విద్యా కుసుమాలు

వ్యవసాయ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన పలువురు విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో మెరిశారు. పేద కుటుంబం నుంచి వచ్చినా పట్టుదలతో చదివి మంచి మార్కులతో రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. – నిజామాబాద్ అర్బన్

మోడల్ స్కూల్‌లో చదివి..



నిజామాబాద్ రూరల్ మండలం కేశాపూర్ గ్రామానికి చెందిన సుప్రియ 467 మార్కులు సాధించింది. ఆమె తండ్రి రవిబాబు, తల్లి పద్మ. వీరిది వ్యవసాయ కుటుంబం. సుప్రియ పదో తరగతి వరకు జక్రాన్‌పల్లిలోని మోడల్ స్కూల్‌లో చదివింది. 9.7 మార్కులు సాధించింది.

ఆశ కార్యకర్త కుమార్తె..



నిర్మల్ జిల్లా బైంసా మండలం చాట్ల గ్రామానికి చెందిన శ్రీనిత్య ఎంపీసీలో 467 మార్కులు సాధించింది. ఆమె తల్లి లక్ష్మీ ఆశకార్యకర్తగా పనిచేస్తుంది. తండ్రి విఠల్ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పదో తరగతిలో శ్రీనిత్య 9.5 మార్కులు సాధించింది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావడం తన లక్ష్యం అని చెప్తోంది.

వ్యవసాయ కుటుంబం నుంచి..



మోపాల్ మండలం మంచిప్ప గ్రామానికి చెందిన సౌమ్య ఎంపీసీలో 990 మార్కులు సాధించింది. ఆమె తండ్రి సాయిలు, తల్లి అనంత వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సౌమ్య పోచంపాడ్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదివింది. భవిష్యత్తులో ఇంజినీర్ అవుతానని ఆమె లక్ష్యంగా పెట్టుకుంది.

గీత కార్మికుడి కుమార్తె



నందిపేట మండలం అయిలాపూర్ గ్రామానికి చెందిన ప్రవీణ్‌గౌడ్-మమత కుమార్తె శ్రీనిజ ఎంపీసీలో 989 మార్కులు సాధించింది. ఆమె తండ్రి గీతకార్మికుడు, తల్లి గృహిణి. శ్రీనిజ రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం





నామినేషన్ వేస్తున్న యుగతులసి పార్టీ అభ్యర్థి కృష్ణమూర్తి, స్వతంత్ర అభ్యర్థి కొండూరు గంగాధర్

నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి బుధవారం 18 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ప్రధాన పార్టీల అభ్యర్థుల తరఫున అనుచరులు మరో సెట్ నామినేషన్ పత్రాలు దాఖలు చేయగా.. పలువురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



ప్రజాసేన పార్టీ అభ్యర్థి నాగార్జున్



పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి రజితవాణి



స్వతంత్ర అభ్యర్థి ముత్యం రఘు

చెక్‌పోస్టు వద్ద భారీగా నగదు పట్టివేత



నిజాంసాగర్: సంగారెడ్డి – కామారెడ్డి జిల్లాల సరిహద్దున నిజాంసాగర్ మండలంలోని వెల్గనూర్ చెక్ పోస్టు వద్ద బుధవారం రాత్రి రూ. 53 లక్షల 42 వేలు స్వాధీనం చేసుకున్నట్లు బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణ తెలిపారు. సంగారెడ్డి- నాందేడ్ జాతీయ రహదారిపై వెళ్తున్న ప్రైవేట్ వాహనాలను తనిఖీ చేయగా హైద్రాబాద్ నుంచి మధ్య ప్రదేశ్ వైపు ఐచర్ వాహనంలో వెళ్తున్న నవీన్ బరదియ అనే వ్యక్తి వద్ద నగదు పట్టుకున్నామన్నారు. నగదుకు సంబంధించిన ఆధారాలు లేకుండా అక్రమంగా తరలిస్తుండటంతో సీజ్ చేశామని సీఐ తెలిపారు. ఎస్సై సుధాకర్ పాల్గొన్నారు.

కోటపాటి చేరికతో బీజేపీ మరింత బలోపేతం

- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ లక్ష్మణ్



ఎంపీ లక్ష్మణ్ సమక్షంలో బీజేపీలో చేరిన కోటపాటి నర్సింహనాయుడు

ఆర్మూర్: పసుపు రైతుల సంఘం, ప్రవాస భారతీయుల సంక్షేమ, హక్కుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కోటపాటి నర్సింహనాయుడు బీజేపీలో చేరడంతో ఈ ప్రాంతంలో బీజేపీ మరింత బలోపేతం అవుతుందని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన కోటపాటి నర్సింహనాయుడు ఎంపీ ధర్మపురి అర్వింద్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో బుధవారం బీజేపీలో చేరారు. ఆయన ఇటీవల బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన విషయం విదితమే. బీఆర్ఎస్ పార్టీలో చేరక ముందు బీజేపీ అనుబంధ సంస్థ అయిన స్వదేశీ జాగరణ్ మంచ్ ఆధ్వర్యంలో ఆర్మూర్ ప్రాంతంలో పసుపు రైతుల పక్షాన, గల్ఫ్ బాధితుల పక్షాన ఉద్యమాలు నిర్వహించి సఫలీకృతమైన చరిత్ర ఆయనకు ఉంది. 2008లో ఎర్రజొన్న రైతుల సమస్యపై ఆరు రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసిన రైతు నాయకుల్లో ఈయన ఒకరు కావడంతో ఈ ప్రాంత వాసులకు కోటపాటి సుపరిచితుడే. పసుపు బోర్డు సాధించడమే లక్ష్యంగా గత ఎన్నికల్లో సమస్య తీవ్రతను కేంద్ర స్థాయిలో చర్చకు తీసుకురావాలనే లక్ష్యంతో కోటపాటి ఆధ్వర్యంలో పలువురు రైతులు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై పోటీ చేయడానికి నామినేషన్లు వేశారు. ఇందల్‌వాయి కిషన్, మంగ్లారపు నవీన్, దోర్నాల రవీందర్, ఎర్రం రాజు, మోత్కూరు దేవాగౌడ్, కొక్కుల విద్యాసాగర్, గిద్దె వినయ్, కోటపాటి శివకృష్ణ, బోయల్ల రవికుమార్ ఉన్నారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య



రవీందర్(ఫైల్)

సిరికొండ: తనపై దాడి చేశారని మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని గడ్కోల్‌లో చోటు చేసుకుంది. ఏఎస్సై బాల్‌సింగ్ తెలిపిన వివరాలు.. గడ్కోల్ గ్రామానికి చెందిన గుర్రాల రవీందర్(42)పై 15 రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన మల్కి లత బంధువులు దాడి చేశారు. బుధవారం ఆయన పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. లత బంధువులు దాడి చేయడంతో చనిపోతున్నట్లు రాసిన సూసైడ్ నోట్ మృతదేహం వద్ద లభించినట్లు పోలీసులు తెలిపారు. ఘటన స్థలానికి వచ్చిన పోలీసులతో మృతుడి భార్య శ్యామల వాగ్వాదానికి దిగింది. తన భర్త చావుకు కారణమైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ధర్పల్లి సీఐ భిక్షపతి సిబ్బందితో అక్కడకి వచ్చి ఆమెతో మాట్లాడారు. విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శ్యామల ఫిర్యాదు మేరకు లతతో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

అనారోగ్యంతో మహిళ..

ఎడపల్లి: మండలంలోని మంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన సాకలి భూమవ్వ (65) అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందని గ్రామస్తులు తెలిపారు. మృతురాలికి ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈ విషయమై ఎడపల్లి ఎస్సై వంశీచందర్‌రెడ్డిని ఫోన్‌లో వివరణ కోరగా స్పందించలేదు.

మనస్తాపంతో ఒకరు..

మాచారెడ్డి: హనుమాన్ మాల ధరించవద్దని కుటుంబ సభ్యులు వారించినందుకు మనస్తాపానికి గురై ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం లక్ష్మీరావులపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఈరవేణి అంజయ్య(58) కుమారుడు ప్రవీణ్ హనుమాన్ మాల ధరించాడు. అంజయ్య కూడా మాల ధరిస్తానని అనడంతో వద్దని కుటుంబ సభ్యులు వారించారు. దీంతో మనస్తాపానికి గురైన అంజయ్య మంగళవారం సాయంత్రం చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

లింగంపేట: మండలంలోని పొల్కంపేట రోడ్డులో ఒంటర్‌పల్లి తండా సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. ఎక్కపల్లి తండాకు చెందిన లంబాడి సంతోష్ భార్యతో కలిసి బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో సంతోష్ కాలు విరిగింది. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని బాధితులను ఆస్పత్రికి తరలించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో నెల రోజుల జైలు

డిచ్‌పల్లి: డ్రంకన్ డ్రైవ్ కేసులో ఓ వ్యక్తికి నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాలు.. డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఓ వ్యక్తిని బుధవారం నిజామాబాద్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎంఎం అలీ సిరాజ్ ఎదుట పోలీసులు హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆ వ్యక్తికి 30 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇన్ని రోజుల శిక్ష పడటం ఇదే తొలిసారని ఎస్సై తెలిపారు.

యువతి అదృశ్యం

నందిపేట్: నందిపేటలోని ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన మల్లారం మౌనిక (30) అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మౌనికకు మతిస్థిమితం సరిగా లేదని, బుధవారం నుంచి కనిపించడం లేదన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని నాందేవ్‌వాడలో పేకాట స్థావరంపై బుధవారం దాడి చేసి ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. వారి నుంచి రూ.58,430 నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని తెలిపారు.

అదృశ్యమైన వృద్ధుడు శవమై కనిపించాడు



పెద్ద గంగారాం(ఫైల్)

ఇందల్వాయి: ఎనిమిది నెలల క్రితం అదృశ్యమైన వృద్ధుడు శవమై కనిపించాడు. మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన కలిగోట పెద్ద గంగారాం(60) గత ఆగస్టులో ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఆయన మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో గ్రామ శివారులో లభ్యమైంది. 15 రోజుల క్రితం చనిపోయి ఉంటాడని గ్రామస్తులు భావిస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు.

వినాయక్‌నగర్‌లో చైన్‌స్నాచింగ్

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వినాయక్‌నగర్‌లో బుధవారం చైన్ స్నాచింగ్ జరిగింది. హౌజింగ్ బోర్డు కాలనీలో నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో నుంచి బైక్‌పై వచ్చిన ఇద్దరు రెండున్నర తులాల బంగారు చైన్ లాక్కెళ్లారు. ఘటన స్థలాన్ని ఏసీపీ రాజావెంకట్ రెడ్డి, సీఐ నరహరి పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

చెప్పులు ఎత్తుకెళ్లిన దొంగ

ఖలీల్‌వాడి: నగరంలోని సుభాష్‌నగర్‌లో చోరీకి వచ్చిన వ్యక్తికి ఏమి దొరకకపోవడంతో చెప్పులు ఎత్తుకెళ్లాడు. సుభాష్‌నగర్‌లోని వెంకీ అపార్ట్‌మెంట్‌లోకి ఈ నెల 11న ఓ వ్యక్తి బాలుడితో కలిసి వచ్చాడు. అక్కడ చోరీ చేయడానికి ప్రయత్నించగా ఏమి లభించలేదు. దీంతో చెప్పులు ఎత్తుకొని వెళ్లాడు. దీనిపై అపార్ట్‌మెంట్ వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తెగిపడిన విద్యుత్ తీగ



మృతి చెందిన మేక

లింగంపేట: లింగంపేట సమీపంలోని పాత చక్కెర ఫ్యాక్టరీ సమీపంలో బుధవారం 11 కేవీ విద్యుత్ తీగ తెగిపడింది. దీంతో అక్కడ మేస్తున్న మేక విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు యజమాని ఇస్లావత్ హనుమంత్ తెలిపారు. మేక విలువ రూ. 10వేలు ఉంటుందన్నారు.

మహిళను చితకబాది గొలుసు చోరీ

రుద్రూర్: కోటగిరి మండలం కారేగాం క్యాంపులో ఓ మహిళను చితకబాది దొంగలు గొలుసు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. మామిడికాయలు కావాలని ఇంట్లోకి వచ్చిన దుండగులు ఆమెను కొట్టి బంగారం గొలుసును ఎత్తుకెళ్లారు. ఈ విషయమై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.